క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రామ్‌కుమార్, ఎస్సై, సీతానగరం

సీతానగరం: మండల గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు, చోరీలు జరిగే అవకాశం ఉందని ఎస్సై డి. రామ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద ప్రచార రథాన్ని ఎస్సై రామ్‌కుమార్ ప్రారంభించారు. ప్రతి గ్రామంలోనూ ఆటో ప్రచార రథం ప్రజలను అప్రమత్తం చేస్తోంది. దొంగతనాలు జరిగే విధానాలను తెలుపుతూ జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రచారం చేస్తోంది. ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో ఆరు బయట పడుకునే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి గది తలుపులకు తాళాలు వేయాలన్నారు. విలువైన బంగారు ఆభరణాలు ఉంటే బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని, అలాగే సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకోవాలని అన్నారు. ముందుగా పోలీసులకు తెలిపితే సీసీ కెమెరాలు అమర్చుతారని తెలిపారు. దీని ద్వారా దొంగతనాలు అరికట్టే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు తిరుగాడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంటి గేట్లకు తాళాలు వేసుకోవాలని, ఆరుబయట మోటారు సైకిళ్లు పెట్టవద్దని, ఇంటి ఆవరణ లోపల ఉంచాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే, దొంగతనాలు అరికట్టవచ్చని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలో జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న అగ్నేష్

రాజానగరం: ఉపాధ్యాయ బదిలీలను ఆన్‌లైన్ విధానంలో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో జరపాలని, బకాయిలను విడుదల చేయడంతోపాటు పీఆర్‌సీని వేసి, ఐఆర్‌ని ప్రకటించాలని ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయు) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా యూపీ స్కూల్స్‌కి కూడా స్కూల్ అసిస్టెంట్స్‌ని కేటాయించాలని, అర్హులైన వారికి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు మండలంలోని లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలువురు వక్తలు తమ ప్రసంగాలలో పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి అగ్నేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐవి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబశివరావు, దుర్గాప్రసాద్, మహిళా కార్యదర్శి రహీమ్ బేగం, గౌరవాధ్యక్షులు జివి గుప్త పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- మూడు నెలలుగా వేతనాలు లేవు
- పస్తులతోనే పనులు చేస్తున్న వైనం
- రేపో మాపో వస్తాయంటున్న అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాజానగరం: రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు వారివి. చేసిన పనికి ఇచ్చే కూలి సొమ్మే వారి జీవనాధారం. అయితే గత మూడు మాసాలుగా చేసిన పనులకు కూలి సొమ్ము అందక ఆ బడుగు జీవులు ఆకలితో అలమటిస్తున్నారు. దొరికినకాడికి అప్పులు చేసి, రోజువారీ జీవన పోరాటాన్ని సాగిస్తూనే ఒక్కోసారి పస్తులతో పనులకు పోవలసిన దుస్థితిని వారు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయాధారితమైన ప్రాంతాలలో ఏడాది పొడవునా కూలి పనులు దొరకవు, సీజన్ కాని వేళల్లో పనులు లభించక కూలీలు పస్తులు పడుతుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తోంది. పనులు దొరకని రోజుల్లో కూడా కూలీలకు పనులు కల్పించి, వారి జీవనోపాధిని మెరుగుపర్చడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. అయితే గత మూడు మాసాలుగా ఈ పథకంలో పనులు చేస్తున్న కూలీలు వేతనాలు అందక ఆర్థికంగా అనేక అవస్థలు పడుతున్నారు. రెండు దశాబ్దాలకు పైబడి అమలు జరుగుతున్న ఈ పథకంలో గతంలో ఎన్నడూ లేని కరవును కూలీలు చవిచూడవలసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రూ.4.65 కోట్ల వేతన బకాయిలు

ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు జనవరి నుంచి వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు మంజూరు కాకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు అంటున్నారు. ఈ విధంగా జిల్లాలో గత మూడు మాసాలుగా (ఏప్రిల్ కాకుండా) రూ.981 కోట్ల వరకు కూలీలకు వేతన బకాయిలున్నాయి. వీటిలో రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో ఈ బకాయిలు రూ.4.65 కోట్ల వరకు ఉన్నాయి. ఈ మూడు మండలాలలో 35,565 మందికి జాబ్ కార్డులుంటే, పనులకు వస్తున్న కుటుంబాలు 21,175 వరకు ఉన్నాయి. ఒక్కో కూలీకి రోజుకు రూ.307 వేతనం చెల్లించవలసి ఉండగా వారు చేసే పని గంటలను బట్టి (రోజూ 8 గంటలు) రూ. 250నుంచి రూ.260 వరకు వేతనం లభిస్తుంది. ఈ విధంగా రూ.4.65 కోట్ల మేరకు బకాయిలున్నాయి.

మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదు

ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటోంది. ఈ సమయంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉపాధి పనులు చేసే కూలీలకు ఆయా ప్రాంతాలలో టెంట్‌లు వేసి, తాగు నీటి సదుపాయాలను కల్పించడం పరిపాటి. అయితే వీటికి కూడా ప్రభుత్వం చెల్లు చీటీ ఇచ్చారు. కూలీలనే తమ ఇళ్ల నుంచి మంచినీటిని తెచ్చుకోమని అధికారులు అంటున్నారు. ఈ క్రమంలో టెంట్లు, షామియానాల సంగతి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అంతేకాక ఉపాధి కూలీలకు గతంలో ఇచ్చే అలవెన్సులు ఇవ్వడం మానేశారు. అలాగే తట్ట, బుట్ట, గునపం వంటి పనిముట్ల కోసం చెల్లించాల్సిన సొమ్ము కూడా మంజూరు చేయడం లేదు. ప్రచార ఆర్భాటమేగానీ ప్రభుత్వపరంగా తమకు ఇచ్చే సదుపాయాలు ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారని కూలీలు వాపోతున్నారు.

మూడు నెలలుగా ఇదే పరిస్థితి

రోజువారీ కూలి పనులు చేసుకుంటూ బతికే వారికి కూలీ సొమ్ము నెలల తరబడి ఇవ్వకపోతే ఎలా బతుకుతారనే ఆలోచన కూడా పాలకులకు రావడం లేదు. వచ్చుంటే గత మూడు నెలలు ఏప్రిల్ కలుపుకుంటే నాలుగు నెలలుగా ఉపాధి కూలీలు ఏవిధంగా బతుకుతారని ఆలోచించే వారు. ఏదో పరిష్కార చర్య తీసుకొనే వారు. చేసిన పనులకు కూలి ఇవ్వండి సారూ .. అంటూ రోడ్డెక్కవలసిన దుస్థితి కూలీలకు ఎదురయ్యేది కాదు.

– జనిపెల్ల సత్తిబాబు, జిల్లా అధ్యక్షుడు, రైతు కూలీ సంఘం

అప్పులు కూడా పుట్టడం లేదు

కూలీ సొమ్ము అందక, బయట అప్పు పుట్టక కుటుంబ పోషణ కష్టమవుతోంది. ఇన్నిరోజులు ఉన్నకాడికి తాకట్టు పెట్టుకున్నాం. ఇకపై ఏం తాకట్టు పెట్టాలో అర్థం కావడం లేదు. పనులు చేసేచోట గతంలో టెంట్లు వేసి, మంచినీళ్లు పెట్టేవారు, ఇప్పుడు మమ్మల్నే తెచ్చుకోమంటున్నారు. కనీసం పని చేసినోళ్లకు గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వలేదని పాలకులను చూస్తున్నాం.

– వారా అనసూయమ్మ, కూలీ, రామయ్యపాలెం

రెండు మూడు రోజుల్లో వేతనాలు చెల్లిస్తారు

ఉపాధి హామీ పథకంలో కూలీలకు చెల్లించవలసిన వేతన బకాయిలను రెండు మూడు రోజుల్లో చెల్లిస్తారు. ఇందుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని సమాచారం వచ్చింది. ఇందుకు సంబంధించిన రికార్డు వర్కును కూడా సిద్ధం చేస్తున్నాం. నిధులు వచ్చిన వెంటనే కూలీలకు చెల్లించవలసిన బకాయిలు వారి బ్యాంకు అకౌంట్లకు జమ అవుతాయి.

– బాలరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జ్ ఏపీఓ, రాజానగరం

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: స్థానిక సినిమాహాలు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, కంటిపూడి బుజ్జి, పాస్టర్లు అరుణ్‌కుమార్, వర ప్రసాద్, కోటేశ్వరరావు, చక్రవర్తి, పుష్పరాజ్, జాషువా, మోషే పాల్గొన్నారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ,పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం కావడంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విలువలతో కూడిన రాజకీయాలు చేయాలి

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యనారాయణరెడ్డి



పెదపూడి: విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, ప్రతీ విషయంలోనూ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హితవు పలికారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అనపర్తి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి నాన్నమ్మ ఇటీవల మరణించారు. మరణానంతరం దశదిన కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులు సత్తి రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద రోడ్డుపై భోజనాలు ఏర్పాట్లు చేశారు. అయితే ఈ రోడ్డుపై భోజనాలు ఏర్పాటు చేసినప్పుడు వాహనాలు రాకపోకలకు ఇబ్బంది లేకుండా నారయ్య నూతి వీధి రోడ్డును వినియోగించుకునే అవకాశం ఉంది. ఆ విధంగా ఎవరైనా కొంత సమయం కార్యక్రమాలు చేసుకుని కార్యక్రమం పూర్తయిన వెంటనే రోడ్డు ఖాళీ చేయడంతో మళ్లీ వాహనాలు యథావిధిగా వెళ్తుంటాయి. సత్తి రామకృష్ణారెడ్డి నాన్నమ్మ దశదిన కార్యక్రమం రోజున రోడ్డు మీద టెంట్ వేసి, భోజనాలు చేసే సమయంలో పోలీసులను పంపించి టెంట్లు తీయ్యాలని చెప్పటం, కార్యక్రమం జరగకుండా చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దీని వల్ల అప్పటికప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చిందని దుయ్యబట్టారు. ఆ కార్యక్రమానికి వచ్చిన వారి బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు చూసి ముక్కున వేలు వేసుకున్నారని విమర్శించారు. ఇటీవల రామకృష్ణారెడ్డి కొడుకు రిసెప్షన్ వేడుక అనపర్తిలో అధికార మదంతో నిర్వహించారని విమర్శించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడి, రిసెప్షన్ వేదిక వద్ద పనుల కోసం సుమారు 150 నుంచి 200 మంది ఉపాధి హామీ కూలీలను వినియోగించుకున్నారని ఆరోపించారు.

మీ ఇంట్లో శుభకార్యక్రమానికి ఈ విధంగా పనులు చేయించుకోవటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రిసెప్షన్ రోజు కెనాల్ రోడ్డు దగ్గర గంటల కొద్దీ ట్రాఫిక్‌కి అంతరాయం కల్గించారన్నారు. ఇక్కడ ప్రత్యామ్నాయంగా మరొక మార్గం కూడా లేదన్నారు. అయితే ఇంట్లో శుభకార్యక్రమం కావడంతో తాను, మా పార్టీ నాయకులు ఎవరు దానిపై స్పందించలేదని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అన్నారు.

తొమ్మిది రోజులుగా పనిచేయని బోర్లు

- విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాలని మొర
- తాగు, సాగునీరు లేక రైతులకు ఇబ్బందులు



వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఏఈ శిరీషను కోరుతున్న రైతులు

రంగంపేట: ఇటీవల గాలివాన సృష్టించిన బీభత్సానికి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు విరిగిపడి, విద్యుత్తు లైన్ల వైర్లు తెగిపోవడంతో అనేక వ్యవసాయ బోర్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ముఖ్యంగా మండల పరిధిలోని ఒక్క దొడ్డిగుంట గ్రామంలోనే సుమారు 80 పైగా వ్యవసాయ బోర్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, లైన్లు ధ్వంసమయ్యాయి. దీంతో బోర్లు పనిచేయకపోవడంతో పంటలకు, పశువులకు నీరులేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంఘటన జరిగి తొమ్మిది రోజులైనా విద్యుత్తు అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ బోర్లకు సంబంధించిన రైతులు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రంగంపేట విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద ఏఈ తోట శిరీషను కలిశారు. వ్యవసాయ బోర్లు పనిచేయక తాగు, సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే విద్యుత్తు లైన్లు బాగుచేయాలని కోరారు. గాలివాన బీభత్సానికి విద్యుత్తు శాఖకు తీవ్రనష్టం వాటిల్లిందని, మరమ్మతులకు అవసరమైన మెటీరియల్ లేదని, ఉన్నదానితో మరమ్మతులు చేస్తున్నామని, వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తామని ఏఈ శిరీష చెప్పారని రైతులు తెలిపారు. రైతులు తోట వెంకటేశ్వరరావు, నరాలశెట్టి అబ్బు, పంట పెద్దకాపు, మాగపాటి అబ్బు, పంట బ్రహ్మాజీ, మాగాటి భద్రం, పంట పేరేకాపు, తోట సూర్యభాస్కరరావు, పెద్దిరెడ్డి దొర, కొండేపూడి ధర్మరాజు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా చెట్ల నరికివేత

- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు



దానవాయిపేట ఎస్‌బీఐ ఎదురుగా దశాబ్దాల కాలం నాటి చెట్టును నరికి వేసిన దృశ్యం



దానవాయిపేటలో నరికి వేయడంతో చనిపోయిన చెట్టు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు అనునిత్యం చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిద్రావస్థలో కొనసాగుతుండడంతో రాజమహేంద్రవరం నగరంలో దశాబ్దాల వయసు కలిగిన భారీ వృక్షాలు మాయమైపోతున్నాయి. ప్రధానంగా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో షాపుల ముందు, ఇంటి ముందు పెరిగిన చెట్లను తొలగించేందుకు ఇంటి యజమానులు కొత్త పోకడలను అవలంబిస్తున్నారు. మొదటగా వృక్షాల తలభాగాన్ని కత్తిరించే చర్యలు చేపడుతున్నారు. కాండం నుంచి తలభాగాన్ని తొలగించడంతో కొద్ది రోజులకే చెట్టు మృతి చెందుతోంది. కొద్దిరోజుల తర్వాత ఈ విధంగా దెబ్బతిన్న చెట్లను భూమి నుంచి వేర్లతో సహా తొలగించేందుకు యజమానులు చర్యలు చేపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణ, సుందర రాజమహేంద్రవరం లక్ష్యసాధనగా చేపడుతున్న చర్యలకు నగరంలో పలు ప్రాంతాల్లో నిర్దాక్షిణ్యంగా చేపడుతున్న చర్యలకు ఏ విధమైన పొంతనా లేకుండా పోతోందని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు నాటండి, వృక్షాలు పెంచండి, పర్యావరణాన్ని కాపాడండి, వృక్షో రక్షిత రక్షితః ప్రకటనలకే పరిమితం అయిపోతున్నాయి. కాలుష్యం బారిన పడుతున్న నగరంలో పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో అవసరం అయినప్పటికీ దశాబ్దాలుగా పెరిగిన చెట్లను కూకటివేళ్లతో సహా పెకలిస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారంటూ నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ కరవు

నగరంలో ప్రధాన వ్యాపార కేంద్రాలుగా భాసిల్లుతున్న దానవాయిపేట, ప్రకాశం నగర్, ఆర్యాపురం, సీతంపేట ఇలా పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో దశాబ్దాల వయసు కలిగిన సుమారు 50 చెట్లు కనుమరుగైపోయాయి. వృక్షాలను రక్షించాల్సిన నగరపాలక సంస్థ సంబంధిత శాఖ అధికారులు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారనేది అర్థం కాని పరిస్థితి నెలకొంది. వృక్షాలను తొలగించే చర్యలు చేపట్టినా అధికారులు ఏ విధమైన పర్యవేక్షణ చేపట్టడం లేదని నగర ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను తొలగించే యజమానులతో సంబంధిత శాఖ అధికారులు లాలూచీ పడి ఏవిధమైన చర్యలు చేపట్టడం లేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ప్రతీ చిన్న విషయానికి తనిఖీలు చేసే సచివాలయ సెక్రటరీలు ఇలా చెట్లను నరికి వేస్తూ మాయం చేస్తున్నప్పటికీ ,అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉంది. చెట్లను నరికి వేసే వారిపై కేసులు నమోదు చేయాల్సిన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది తమకు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఏళ్ల తరబడి ప్రభుత్వ స్థలాల్లో పెరిగిన చెట్లను తొలగించుకుంటూ పోవడం వల్ల రాజమహేంద్రవరం నగరంలో పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు చెట్లను నరికి వేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టి దశాబ్దాల వయసు కలిగిన చెట్లను కాపాడాలని నగర ప్రజలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు చేపట్టాలి



చెట్లను నరికివేస్తూ పర్యావరణ పరిరక్షణకు శాపంగా మారుతున్న వారిపై నగరపాలక సంస్థ అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటివరకు నగరంలో మాయం అయిపోయిన చెట్ల విషయంలో నగరపాలక సంస్థ అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టారు అనే విషయాన్ని నగర ప్రజలకు అర్థమయ్యేలా ప్రకటించాలి. నరికివేతకు గురవుతున్న చెట్ల వ్యవహారంపై ప్రజా పోరాటం చేస్తా. కమిషనర్ స్పందించి చెట్లను నరికి వేస్తున్న వారిపై చర్యలు చేపట్టి పర్యావరణాన్ని కాపాడాలి.

– దేశిరెడ్డి బలరాం నాయుడు, రాష్ట్ర ప్రజాపక్షం రాష్ట్ర కన్వీనర్, రాజమహేంద్రవరం

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి



నగరంలో ఏళ్ల తరబడి పెరిగిన వృక్షాలను తొలగించేందుకు చర్యలు చేపడుతున్న వారిపై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలి. నగరంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలి. ఇలా చెట్లను నాశనం చేస్తూ పోవడం వల్ల భవిష్యత్తులో పెను ప్రమాదం పొంచి ఉంది. ఎప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలి.

– కార్తికేయన్ కనకరాజ్, రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు జూన్‌లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాష్ట్రంలోని ప్రభుత్వోద్యోగుల డిమాండ్ల సాధనకు ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జూన్ నెలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ తెలిపారు. స్థానిక జైలు రోడ్డులోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో ఏపీజీఈఏ జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభను ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సీనియర్ నాయకులు కేఆర్ సూర్యనారాయణ నేతృత్వంలో నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 12న సంఘం రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. న్యాయస్థానం జడ్జి అధ్యక్షతన పే రివిజన్ కమిషన్ ఏర్పాటు, తాత్కాలిక భృతి ప్రకటన వంటి డిమాండ్ల పరిష్కారానికి తమ సంఘం పోరాడుతుందన్నారు. జిల్లా సహ అధ్యక్షుడు చంబర్లీన్, ఉపాధ్యక్షులు కే.వెంకటేశ్వరరావు, పి.రవికుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కాపవరంలో సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పెదపూడి బేతేలు చర్చిలో ఈస్టర్ ప్రత్యేకతను ఉపదేశిస్తున్న బిషప్ చుక్కా సామ్యూల్‌రాజు



కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్‌చేస్తున్న రెవరెండ్ ఫాదర్ మాణిక్యం

పెదపూడి: ఏసు క్రీస్తు మరణాన్ని జయించి మూడో రోజు తిరిగి లేవడాన్ని పురస్కరించుకుని పునరుత్థాన పండగ(ఈస్టర్) వేడుకలను క్రైస్తవ భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి మండలంలో అన్ని గ్రామాల్లో పలు చర్చిల్లో పండగ వాతావరణం నెలకొంది. దీనిని పురస్కరించుకొని ముందుగానే చర్చిలను అందంగా అలంకరించారు. క్రైస్తవులంతా ఎంతో ఉత్సాహంగా క్రీస్తును ప్రత్యేకంగా ఆరాధించారు. ఈ పండగ ప్రత్యేకతను తెలిపే భక్తి గీతాలను ఆలపించి, పునరుత్థానుడైన క్రీస్తును కొలుస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెదపూడిలో బేతేలు చర్చిలో బిషప్ చుక్కా సామ్యూల్‌రాజు, దేవకుమారి దంపతులు క్రీస్తు దైవ సందేశాన్ని భక్తులకు వినిపించారు. క్రీస్తు మరణాన్ని జయించి, పునరుత్థానుడైన విధానాన్ని భక్తులకు ఉపదేశించారు. అనంతరం క్రైస్తవ భక్తులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తదనంతరం భక్తులు ఏర్పాటు చేసిన ప్రేమ విందులో భోజనాలు చేశారు. పాస్టర్ చుక్కా జాన్ రత్నం, చర్చి యూత్ పాల్గొన్నారు.

క్రైస్తవ సమాధుల వద్ద భక్తుల సందడి

మండలంలో ఈస్టర్ పండగను పురస్కరించుకుని క్రైస్తవులు మృతులైన వారి బంధువుల సమాధులను ఆదివారం తెల్లవారుజామున దర్శించి వారి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సమాధుల వద్ద వారి బంధువులు కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందురోజు సమాధులకు సున్నాలు వేసి రకరకాల పూలతో అందంగా అలంకిరించారు. మండలంలో కరకుదురు, పెదపూడి, రామేశ్వరం, జి.మామిడాడ, పెద్దాడ, గండ్రేడు తదితర గ్రామాల్లో ఈ సమాధుల వద్ద పండగ వేడుకలు జరిగాయి.

కోరుకొండ: క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఈస్టర్ పండగను జరుపుకున్నారు. వారి ఆరాధ్యదైవం యేసు క్రీస్తు శ్రమలను అనుభవించి ఈ నెల 18వ తేదీన శిలువపై మరణించడంతో గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. దానిలోభాగంగా ఆదివారం క్రీస్తు సమాధిలో నుంచి ఉత్థానుడవ్వడంతో ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. దీంతో 40 రోజులుగా చేసిన ఉపవాస దీక్షలు ముగిశాయి. ఉదయమే సమాధుల వద్దకెళ్లిన క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ మాణిక్యం కేక్ కట్ చేశారు. మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా ఈస్టర్

బిక్కవోలు: మరణానంతరం జీవం ఉందని, ఆ జీవానికి ఏసుక్రీస్తే మార్గమని క్రైసవ మత పెద్దలు తొస్సిపూడి పాస్టర్ బిషప్ ఎం ఎస్ సమర్పణ్ తెలిపారు. ఆదివారం మండలంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుప్రభువు శిలువపై మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా భావిస్తారని..తిరిగి లేచిన రోజైన తొలి ఆదివారాన్ని ఈస్టర్ పర్వదినంగా క్రైస్తవులు జరుపుకుంటారన్నారు. పందలపాకలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఊలపల్లిలో పాస్టర్ ఇమ్మనేయేలు ఆధ్వర్యంలో సువార్త సంగీతం స్తుతి ఆరాధన నిర్వహించారు. కాపవరంలో సమాధి వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు కర్రి గంగారాజు పాల్గొన్నారు.

లంకల్లో కొనసాగుతున్న మట్టి అక్రమ రవాణా



మట్టి తవ్వకాలకు సిద్ధం చేసిన భారీ యంత్రం

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని గోదావరి లంకల్లో అక్రమంగా మట్టి రవాణా కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే పొట్టిలంక శివార్లలో మట్టి అక్రమ తవ్వకాలు కడియం మండలం పరిధిలోనిది కాదని రెవెన్యూ అధికారులు చేతులు దులిపేసుకున్నారు. దీనిని అవకాశంగా మలచుకున్న అక్రమ తవ్వకందారులు ప్రస్తుతం కడియపులంక- బుర్రిలంక మధ్యనున్న గోదావరి లంకల్లో నుంచి మట్టిని తవ్వి బైటకు తరలిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇందు కోసం భారీ యంత్రాలను లంకల్లోనే ఉంచుతున్నారంటున్నారు. అధికారులు కనీసం ఆ వైపునకు కూడా కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలు పాటించకుండా ఇలా అక్రమార్కులు లంక మట్టిని తవ్వేస్తుండడం పట్ల స్థానిక రైతుల్లో ఆందోళన నెలకొంది.



కడియపులంక పరిధిలోని గోదావరి లంకల్లో అక్రమార్కులు మట్టి తరలించుకుపోయిన దృశ్యం